


## చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం  పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం  కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో 1950-1960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# కథ పేరు: దివ్యదృష్టి
## { హెన్రీ స్లీసర్ కథకి స్వేచ్ఛానువాదం }

**లూకాస్ టేక్సీని** ఆపి కిందకి దిగి ఎదురుగా ఉన్న ఇంటి తలుపుని తట్టాడు. గెరాల్డైన్ వీలర్ తలుపు తెరచి చెప్పింది.

"లోపలకి రా. నా పెట్టెని తీసుకెళ్ళు."

లూకాస్ ఆమె వెంట మెట్లెక్కి పైకి వెళ్ళాడు. ఆ ట్రంక్ పెట్టె చాలా బరువుగా ఉంది. దాన్ని భుజాన ఎత్తుకుని అడిగాడు.

"ఇదొకటేనా మిస్ గెరాల్డైన్?"

"అవును లూకాస్. మిగిలిన పెట్టెలని ఇప్పటికే క్రూజ్‌కి పంపేసాను. ఇంక బయలుదేరుదాం."

మెడ్వేల్‌లో అతను ఒక్కడే టేక్సీ డ్రైవర్.

ఆమె వెనక్కి తిరగ్గానే లూకాస్ ట్రంక్ పెట్టెని నిశ్శబ్దంగా కిందకి దింపి, ఫైర్ ప్లేస్ పక్కనే ఉన్న పోకర్ని అందుకుని వెనక నించి ఆమె తలమీద బలంగా మోదాడు. అది చేసిన శబ్దానికి ఆమె మరణించిందని అనుకున్నాడు. తన వేలి ముద్రలు పోవడానికి ఆ పోకర్ని ఫైర్ ప్లేస్‌లోని నిప్పులో ఉంచి, తర్వాత దాన్ని యథాస్థానానంలో ఉంచాడు. తర్వాత ఒంగి కిందకి పడి ఉన్న ఆమెను పరీక్షించాడు.

ఆమె పోయిందని స్పష్టం కాగానే ఆ శవాన్ని అవలీలగా ఎత్తుకుని, కిందకి దిగి వెనక వంటగది తలుపులోంచి ఆమె ఎస్టేట్ లో ఇంటికి దూరంగా ఉన్న చెట్ల మధ్యకి నడిచాడు. సరైన ప్రదేశాన్ని ఎన్నుకుని, కిందకి దింపి టూల్ షెడ్లోకి వెళ్ళి పార, గునపాలని తీసుకున్నాడు. ఆమెని పాతిపెట్టాక ఆ చలికాలంలో మొదటిసారి అతనికి చెమట పట్టింది.

ఏప్రిల్ నెల్లో అతని టేక్సీ మరోసారి గెరాల్డైన్ ఇంటి ముందు ఆగింది. అందులోంచి డేవిడ్, అతని భార్య రొవేనా దిగారు. వర్షంలో తుడుస్తూ గుమ్మం దగ్గర తమ కోసం ఎదురు చూస్తూ నిలబడ్డ ఆంట్ ఫెయిత్‌ని చూసారు.

"ఆవిడే నా అత్త. జిప్సీ అని ముద్దు పేరు. ఆమె సియాన్స్ గురించి, అతీంద్రియ విద్యల గురించి మాట్లాడుతూంటే మొహాన్ని విసుగ్గా పెట్టకు" డేవిడ్ చెప్పాడు.

"ప్రయత్నిస్తాను" రొవేనా పొడిగా చెప్పింది.

డేవిడ్ ఆడవాళ్ళు ఇద్దర్నీ ఒకర్ని మరొకరికి పరిచయం చేసాడు. రొవేనాని చూసి ఆవిడ చెప్పింది.

"నువ్వు చాలా అందంగా ఉన్నావు."

లోపల ఫైర్ ప్లేస్ ముందు కూర్చుని, సిగరెట్ తాగుతున్న ఓ వ్యక్తిని ఫెయిత్ ఇద్దరికీ పరిచయం చేసింది.

"లెఫ్టినెంట్ రీస్.. ఇతను నా మేనల్లుడు డేవిడ్. అతని భార్య రొవేనా."

"ఇలా కలుస్తున్నందుకు సారీ. ఐతే నేను నా వృత్తిరీత్యా ఇలాంటి సందర్భాల్లోనే కలుస్తూంటాను. మీరు మెడ్వేల్ నించి వలస వెళ్ళి ఎంత కాలమైంది?" రీస్ ప్రశ్నించాడు.

"పదేళ్ళు. అప్పుడప్పుడూ వచ్చి వెళ్తూంటాను. దక్షిణ ప్రాంతంలోని మా కుటుంబ వ్యాపారాన్ని చూసుకుంటున్నాను."

"మీరూ, మీ సోదరి గెరాల్డైన్ ఆ మిల్లుకి యజమానులు కదా?" రీస్ ప్రశ్నించాడు.

"అవును. ఆమె నా సవతి సోదరి. గెరాల్డైన్‌కి, నాకు పెద్దగా పడదు. ఇద్దరం ఒకరికొకరం దూరంగా ఉంటూంటాం. ఆమె మాయమయ్యాక నన్ను కాంటాక్ట్ చేయలేదు. ఆఖరిసారి ఆమెని చూసింది నేను మార్చ్‌లో వచ్చినప్పుడు."

"అవును మీ అత్త చెప్పింది. అప్పటి మీ రాకకి కారణం?"

"పూర్తిగా వ్యాపారం. మిల్లుకి కొత్త యంత్రం కొనడానికి బేంక్ లోన్ తీసుకోడానికి గెరాల్డైన్ కూడా సంతకం చేయాలి. ఆమె నిరాకరించడంతో తిరిగి వర్జీనియాకి వెళ్ళిపోయాను."

"ఆ తర్వాత మళ్ళీ చూడలేదా?"

"లేదు. ఆమె ఇప్పుడు ఎక్కడ ఉందో కూడా నాకు తెలీదు."

రీస్ వెళ్ళిపోయాడు.

"నాకు ఆశ్చర్యంగా ఉంది. కరీబియన్ ట్రిప్‌కి బుక్ చేసుకుంది. టేక్సీ డ్రైవర్ లూకాస్ ఆమెని రైల్వే స్టేషన్‌కి తీసుకెళ్ళడానికి వచ్చాడు. కాని ఇంట్లో లేదు. ఎక్కడా లేదు. ఏమైనట్లు? పోలీసులు హాస్పిటల్స్, మార్చురీలు మొదలైన చోట్ల వెదికారు. ఆమెకి ఏమైందో ఎక్కడికి వెళ్ళిందో ఇంతదాకా తెలీదు. ఎవరైనా దొంగలు చంపారా అంటే ఇంట్లోవి ఏమీ మాయం కాలేదు. లెఫ్టినెంట్ రీస్ చెప్పేది నేను నమ్మను. ఎవరో బాయ్ ఫ్రెండ్‌తో వెళ్ళిపోయి ఉంటుందని అతని అభిప్రాయం" ఆంట్ ఫెయిత్ చెప్పింది.

"రీస్ చెప్పింది నిజం అనుకుంటా. ట్రక్ డ్రైవరో, గనుల్లో పనిచేసేవాడో వాడు ఎవడో చవకబారు మగాడై ఉండచ్చు" రొవేనా చెప్పింది.

"డేవిడ్! గెరాల్డైన్ ఎక్కడుందో తెలుసుకోడానికి నాకో మార్గం తట్టింది. కాని అందుకు నువ్వు ఒప్పుకోవు. సరే. నువ్వు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా గెరల్డైన్ ఎక్కడుందో ఐరిన్‌ని అడగదలచుకున్నాను."

"ఎవర్ని?"

"ఐరిన్‌ని. రెండు నెలల క్రితం ఆమె గురించి దినపత్రికలో వార్త వచ్చింది. నీకు రాసిన ఉత్తరాల్లో ఆమె గురించి రాసాను కూడా."

"ఆంట్ ఫెయిత్. నాకు గుర్తుంది. ఆమె సైకిక్. లేదా అలాంటిది. అనాధ కూడా కదా?" రొవేనా అడిగింది.

"ఐరిస్ ప్రభుత్వ ఆధీనంలోని మెడ్వేల్ హోం ఫర్ గర్ల్స్‌లో ఉంటోంది. దానికి నేను వైస్ ఛెయిర్ పర్సన్ని. ఆమె నిజమైన క్లెయిర్ వాయెంట్. వయసు పదహారు."

"నిజంగా గెరాల్డైన్ ఎక్కడ ఉందో ఆమె ఏ సియాన్స్ ద్వారానో కనుక్కోగలదా?" డేవిడ్ అడిగాడు.

"ఆమె మీడియం కాదు. ఆమెని ఫైండర్ అని పిలవచ్చు. అంటే చూసేది. పోయిన వస్తువులని కాని, మనుషులని కాని కనుక్కునే సమర్ధత ఆమెకి ఉంది."

"ఆమెకి ఆ శక్తి ఎలా వచ్చింది?" రొవేనా అడిగింది.

"నాకు తెలీదు. ఐరిస్ కూడా చెప్పలేదు. ఆ హోంలోని సిస్టర్ థెరీసా వస్తువులని ఎక్కడ ఉంచిందో ఎప్పుడూ మర్చిపోతూంటుంది. ఐరిస్ ప్రతీసారి అవి ఎక్కడ ఉన్నాయో సరిగ్గా చెప్తూంటుంది."

"ఒకోసారి పిల్లలు వస్తువులని దాచి తమాషా చేస్తూంటారు" డేవిడ్ నవ్వి చెప్పాడు.

"కాని ఇది విను. ఓసారి వాళ్ళని క్రాంప్టన్ చెరువుకి పిక్నిక్‌కి తీసుకెళ్ళారు. ఎనిమిదేళ్ళ డరోథీ మాయమైంది. ఆమె కోసం వెదుకుతూంటే అకస్మాత్తుగా ఐరిస్ పెద్దగా అరవసాగింది. కనుక్కోవడం కొంత బాధాకరంగా ఉంటుందిట. డరోథీ ఉండే ప్రదేశాన్ని వర్ణించింది. అది ఓ చిన్న గుహ. ఆమె చెప్పిన చోట, కాలుజారి పడివున్న డరోథీని కనుగొన్నారు."

"దాన్ని పోలీసులకి వదులుదాం. దెయ్యాలతో పెట్టుకోవద్దు" డేవిడ్ అసంతృప్తిగా చెప్పాడు.

"నువ్వా మాట అంటావని నాకు తెలుసు. ఐరిస్ మనింటికి వచ్చి కొన్ని రోజులు ఉండే ఏర్పాటు చేసాను. గెరాల్డైన్ ఆరా ఈ ఇంట్లో ఉంటే ఆమె ఆచూకీ తెలియచ్చని."

"అంటే ఐరిస్ ఇక్కడికి వస్తుందా?"

"అవును."

"నాకు అది ఇష్టంలేదు. ఇది హాస్యాస్పదం."

"ప్రయత్నించడంలో తప్పు లేదు. ఆ హోం డైరెక్టర్ ఇలాంటివి ప్రోత్సహించకూడదని చెప్పింది. కాని అది భ్రమకాదు. దేవుడి వరం" ఫెయిత్ చెప్పింది.

ఐరిస్‌ది పోనీ టైల్. శుభ్రంగా ఉన్న చవక దుస్తుల్ని ధరించింది. డేవిడ్ అయిష్టంగానే ఆ మధ్యాహ్నం ఆ పదహారేళ్ళ అమ్మాయిని హోం నించి తీసుకు వచ్చాడు. ఐరిస్ మౌనంగా ఇల్లంతా తిరిగి చూసింది. ఫెయిత్ మాయమైన గెరాల్డైన్ ఫోటోని చూపించింది. ఐరిస్ ఎక్కువ కాలం తన గదిలోనే గడుపుతోంది. ఫెయిత్ మూడో రోజు ఐరిస్‌ని అడిగింది.

"గెరాల్డైన్ ఎక్కడ ఉందో కనుక్కోగలిగావా?"

"ఈ ఫోటోలోని దుస్తుల్లోనే ఉంది. చాలా దగ్గర్లో ఉన్న భావన కలుగుతోంది. కాని ఇంకా ఆ ప్రదేశం స్పష్టంగా తెలీడంలేదు."

"ఐరిస్ సాధారణ పిల్లలానే ఉంది. ఇదంతా అబద్ధం" రొవేనా తన భర్తతో చెప్పింది.

దేవిడ్ మెద్వేల్ సూపర్ బజార్‌కి సరుకులని తీసుకురావడానికి వెళ్తే బయట టేక్సీ డ్రైవర్ లూకాస్ కనిపించాడు.

"హలో మిస్టర్ దేవిడ్" అతను పలకరించాడు.

"హలో లూకాస్. వ్యాపారం ఎలా ఉంది?"

"నేను విన్నది నిజమేనా? గెరాల్డైన్‌ని కనుక్కోడానికి ఐరిస్ మీ ఇంటికి వచ్చిందా?"

"అవును. మా ఆంట్ నేను వద్దంటున్నా రప్పించింది. ఆమెకి ఆ శక్తి లేదని హామీ."

"కాని ఉందని అంతా అంటున్నారు. డరోథీని సరిగ్గా కనుక్కుందని పేపర్లో రాసారు. గెరాల్డైన్ ఎక్కడ ఉందో ఆమె కనుక్కుంటే మనిద్దరికీ ప్రమాదం. అలా జరక్కుండా చూడండి" లూకాస్ భయంగా చెప్పాడు.

ఇంటికి వచ్చేసరికి గెరాల్డైన్ దుస్తులు ధరించిన ఐరిస్ కనపడింది.

"వాటిని ఎందుకు వేసుకున్నావు?" అతను కోపంగా అడిగాడు.

"ఆమె ఆరా కోసం. ఇవి సహాయం చేస్తాయని."

"వెంటనే వాటిని విప్పేయ్. నీకు నా చెల్లెలి దుస్తులు వేసుకునే హక్కులేదు" దేవిడ్ కోపంగా అరిచాడు.

"పాపం, ఈ పిల్ల మనకి సహాయం చేసే ప్రయత్నం చేస్తోంది దేవిడ్. దానికి అడ్డు రాకు. తప్పిపోయిన మూడు పిల్లులని ఐరిస్ కనుక్కుంది. కాబట్టి ఆమె మోసకారి కాదు" ఆంట్ కోప్పడింది.

"రెండేళ్ళ క్రితం తప్పిపోయిన నా పిల్లి ఈ ఇంట్లో ఎక్కడుందో కనుక్కోగలవా?" దేవిడ్ అడిగాడు.

వెంటనే ఐరిస్ కళ్ళు మూసుకుంది. నడుం నించి అటు, ఇటు కదలసాగింది.

"వేడిగా ఉంది.. చాలా వేడిగా ఉంది... ఇక్కడ చాలా వేడిగా ఉంది.." ఐరిస్ గట్టిగా అరిచింది.

"ఇది నటన" దేవిడ్ చెప్పాడు.

"ష్!" ఆంట్ చెప్పింది.

"స్టవ్ వెనక పిల్లికి వేడిగా ఉంటుంది" చెప్పి ఐరిస్ అనేక బాధాకరమైన అరుపులు అరిచింది.

"ఎలక్ట్రిక్ ఓవెన్ వచ్చాక మనం బేస్‌మెంట్లోని పెద్ద ఇనప కుంపటిని ఉపయోగించడంలేదు. అక్కడ చూద్దాం."

రొవేనా వెంటనే వెళ్ళి కొద్దిసేపట్లో వచ్చి చెప్పింది.

"అక్కడ పిల్లి అస్థిపంజరం ఉంది."

దేవిడ్ మొహం వెంటనే పాలిపోయింది.

ఆ సాయంత్రం ఐరిస్ డేవిడ్‌తో నవ్వుతూ చెప్పింది.

"నాకు మిసెస్ క్లేటన్ గురించి తెలుసు ."

డేవిడ్ ఉలిక్కిపడ్డాడు. అతనికి ఆమెతో కొద్దికాలంగా అక్రమ సంబంధం ఉంది.

"క్లేటన్? ఎవరు?" ప్రశ్నించాడు.

"మీ సెక్రటరీ."

"ఇంకాపు" డేవిడ్ కోపంగా అరిచాడు.

ఐదు రోజుల తర్వాత లూకాస్ మళ్ళీ కనిపించినప్పుడు అడిగాడు.

"ఐరిస్‌ని ఇంకా పంపించలేదే? చచ్చిన నీ పిల్లిని కూడా కనుక్కుందిట కదా?"

"ఐరిస్ మోసగత్తె లుకాస్. రహస్యంగా అన్నీ వింటూంటుంది."

"మీరు  చెప్పినట్లే గెరాల్డైన్‌ని చంపాను. ఇప్పుడు ఆమె శవం బయటపడితే ఆఖరిసారి ఆమెని చూసానని పోలీసులు నన్ను అరెస్ట్ చేస్తారు. ఆమెని ఇంటికి వెళ్ళి చంపానని ఆరోపిస్తారు. పోలీసులు ఆమె ఎక్కడో జీవించి ఉందని భావిస్తున్నంత కాలం నాకు ప్రమాదం ఉండదు. కాబట్టి పంపించేసేయండి" లూకాస్ అభ్యర్ధనగా చెప్పాడు.

"నా చెల్లెలు మాయమైంది. మళ్ళీ తిరిగిరాదు. కాబట్టి భయపడకు.

మరో పది రోజులు డేవిడ్ ఐరిస్ గురించి భయపడ్డాడు. ఆంట్ ఫెయిత్‌కి ఐరిస్ మీద గల నమ్మకం, సహనం అపారం. డేవిడ్ ఆమెని పంపమని కోరినా పంపించలేదు.

"ఆమె క్లైయిర్‌వాయెంట్ అన్నది నిజం. ఆమె నీ వంక చూసినప్పుడల్లా గమనిస్తున్నాను. నీ మనసులోని ప్రతీ చెడ్డ ఆలోచనా ఐరిస్‌కి తెలిసిపోతున్నటుగా నాకు అనిపిస్తోంది" చెప్పింది.

"ఆంట్. ఆమె గొప్ప నటి. అంతకుమించి మరేం కాదు. ఇల్లంతా వెతికి ఏది ఎక్కడ ఉందో చూసింది కాబట్టే పిల్లి గురించి చెప్పగలిగింది. లేదా గెరాల్డైన్ ఎక్కడ ఉందో ఈపాటికి చెప్పగలిగేది కదా?"

ఐరిస్ గదిలోంచి బాధాకరమైన అరుపులు వినిపించాయి. వెంటనే ముగ్గురూ ఆమె గదిలోకి వెళ్ళారు.

"ఐరిస్. ఏమైంది? కులాసానా?" ఫెయిత్ ఆందోళనగా అడిగింది.

ఐరిస్ కళ్ళు స్లీప్ వాకర్ కళ్ళలా ఎటో చూస్తున్నట్లుగా కనిపించాయి.

"నేను కులాసానే. నేనింత కాలానికి సిద్ధమయ్యాను. గెరాల్డైన్‌తో కనెక్ట్ అయ్యాను. ఆమె ఎక్కడ ఉందో చెప్పగలను."

వెంటనే ఫెయిత్ లెఫ్టినెంట్ రీస్‌కి ఫోన్ చేసి వెంటనే రమ్మని కోరింది.

"ఆంట్! ఇప్పుడు టైం ఎంతైందో తెలుసా? ఇది అతని డ్యూటీ సమయం కాదు" డేవిడ్ చెప్పాడు.

"ఐనా వస్తాడు. చూస్తూండు."

లెఫ్టినెంట్ రీస్ కొద్దిసేపట్లో వచ్చి ఐరిస్ పక్కన కుర్చున్నాడు.

"ఆమె ఎప్పుడైనా చెప్పచ్చు రీస్. డేవిడ్ దయచేసి పెద్ద లైట్ ఆర్పేస్తావా?" ఫెయిత్ అడిగింది.

ఐరిస్ కళ్ళు మూసుకుని నడుం పై భాగాన్ని అటు, ఇటు ఊపసాగింది. అంతా నిశ్శబ్దంగా ఆమెనే చూడసాగారు. ఆమె చిన్నగా మూలిగింది.

"మొదలైంది. చెప్పబోతోంది" ఫెయిత్ గుసగుసలాడింది.

ఐరిస్ మూలుగు ఎక్కువైంది. భాధాకరమైన అరుపులు అరుస్తూ ఊపిరి గట్టిగా పీల్చుకుని వదలాల్సింది. నోటి పక్కనించి నురగ గడ్డం మీదకి కారింది.

"ఐరిస్‌కి ఫిట్ వచ్చినట్లుంది. చికిత్స చేయాలి" డేవిడ్ వణికే కంఠంతో చెప్పాడు.

"కాదు. ఇది ట్రాన్స్ మాత్రమే.."

ఐరిస్ పెద్దగా అరిచింది. ఎంత పెద్దగా అంటే రొవేనా తన చెవులని చేతులతో మూసుకుంది.

"ఆంట్ ఫెయిత్. ఆంట్ ఫెయిత్. నేను ఇక్కడ ఉన్నాను. వచ్చి సహాయం చేయి. ఇక్కడంతా చీకటి. ఎవరూ సహాయం చేయలేరా?" ఆ గొంతు ఐరిస్‌ది కాదు.

"ఎక్కడున్నావ్ గెరాల్డైన్. ఎక్కడ?" ఫెయిత్ కళ్ళమ్మట నీళ్ళు కారుతూంటే అడిగింది.

"ఆంట్ ఫెయిత్. సహాయం చేయి. ఇక్కడంతా చీకటి. వినపడుతోందా?"

"వినపడుతోంది. ఎక్కడున్నావో ముందు చెప్పు."

రీస్ లేచి వెళ్ళి ఆమె పల్స్‌ని, కుడికంటి రెప్పని ఎత్తి కనుపాపని చూసాడు.

"ఐరిస్. నా మాట వినిపిస్తోందా? నువ్వు కులాసానా?" అడిగాడు.

"ఎస్ సర్. వినిపిస్తోంది."

"గెరాల్డైన్ ఎక్కడ ఉందో తెలుసా?"

ఐరిస్ నెమ్మదిగా కళ్ళు విప్పి చుట్టూ ఉన్న ముఖాల వంక చూసింది.

"గెరాల్డైన్ ఎక్కడుంది? మళ్ళీ ప్రశ్నించాడు.

ఆమె కళ్ళు ఎక్కడో దూరంగా చూసినట్లుగా చూసాయి.

"చాలా దూరంలో ఎక్కడో. ఓడలున్న ప్రదేశం. సూర్యుడు అస్తమిస్తున్నాడు. కొండలు. ఆకుపచ్చ చెట్లు. వీధుల్లో గంటలు మోగడం విన్నాను."

"ఓడలున్న చోటా? అలాంటి ప్రదేశాన్ని మీరు గుర్తుపట్టగలిగారా?" రీస్ ఆంట్, డేవిడ్ల వంక చూస్తూ అడిగాడు.

ఎవరూ జవాబు చెప్పలేదు.

"అది ఊరు. చాలా దూరంలోని ఊరు."

"సముద్రం అవతలా?"

కాదు. ఇక్కడే. అమెరికాలో ఎక్కడో. ఓడలు, బే, ఆరెంజ్‌రంగు బ్రిడ్జ్, నీలం రంగు నీళ్ళు.."

"శాన్‌ఫ్రాన్సిస్కో, అది తప్పకుండా శాన్‌ఫ్రాన్సిస్కోనే" రొవేనా చెప్పింది.

"ఐరిస్. అది ఎక్కడో చెప్పాలి. ఈ పెద్ద దేశంలో ఎక్కడని వెతకను. గెరాల్డైన్‌ని నువ్వు చూసింది శాన్‌ఫ్రాన్సిస్కోలోనేనా?" రీస్ అడిగాడు.

"ఏమో? వీధుల్లో ట్రాలీలని చూసాను. ఎత్తైన వీధుల్లో వింతగా ఉన్న ట్రాలీలు పైకి ఎక్కుతున్నాయి."

"ట్రాలీ కాదు. ట్రామ్. వీధుల్లో గంటలు కొడుతూ ట్రాములు ప్రయాణించేది అక్కడే. గెరాల్డైన్ ఎప్పుడైనా అక్కడికి వెళ్ళిందా? తెలిసినవాళ్ళున్నారా?" రీస్ అడిగాడు.

"ఎప్పుడూ వెళ్ళలేదు. డేవిడ్. గెరాల్డైన్ అక్కడికి ఎందుకు వెళ్ళిందో నీకు తెలుసా? ఆంట్ అడిగింది.

"తెలీదు" డేవిడ్ రిలీఫ్‌గా నవ్వి చెప్పాడు.

తర్వాత లేచి వెళ్ళి ఐరిస్ భుజం మీద తట్టి చెప్పాడు.

"ఐరిస్. నువ్వు నిజమే చెప్పి ఉంటావు. గెరాల్డైన్ దయ్యం నీకు నిజమే చెప్పింది. అవునా?"

"నేను హోంకి వెళ్తాను. మదర్ రోజ్ కావాలి" ఐరిస్ చిన్నపిల్లలా ఏడవసాగింది.

మెడ్వేల్ హోం ఫర్ గర్ల్స్‌లో ఐరిస్‌ని దింపి ఇంటికి వచ్చాక డేవిడ్ నవ్వి చెప్పాడు.

"గెరాల్డైన్ ఈపాటికి శాన్‌ఫ్రాన్సిస్కో నించి సౌత్ ఈస్ట్‌కి బయలుదేరి ఉండచ్చు."

"ఐరిస్ ఇంతదాకా ఎన్నడూ అబద్ధం చెప్పలేదు. కాబట్టి పోలిసులు తప్పక గెరాల్డైన్‌ని కనిపెడతారు. అప్పుడుకాని నువ్వు నమ్మవు" ఖిన్నురాలైన ఫెయిత్ చెప్పింది.

మర్నాడు డేవిడ్ దంపతులు టేక్సీలో రైల్వే స్టేషన్‌కి చేరుకున్నారు. లూకాస్‌కి డబ్బిచ్చాక డేవిడ్ అతన్ని పక్కకి తీసుకెళ్ళి రహస్యంగా చెప్పాడు.

"ఐరిస్‌ని హోంలో దింపేసాం."

"అంటే గెరాల్డైన్ ఎక్కడ ఉందో చెప్పలేదా?" లూకాస్ ప్రశ్నించాడు.

"తెలిస్తేగా?"

"ఐతే నేను అనవసరంగా భయపడ్డాను. ఆ పని చేయకుండా ఉండాల్సింది" లూకాస్ చెప్పాడు.

"ఏమిటి నువ్వనేది?"

"గెరాల్డైన్‌ని నేను ఎక్కడ పాతానో ఐరిస్ కనుక్కుంటుంది అనుకుని ఆమె కనుక్కోలేని దూరప్రదేశానికి పంపాను."

"ఏ దూర ప్రదేశం?" డేవిడ్ అడిగాడు.

"నిజానికి నేనిది మీకు చెప్పదలచుకోలేదు. క్రితం వారం ఓ రాత్రి నేను మళ్ళీ తవ్వి గెరాల్డైన్ శవాన్ని తీసి, ఆమె ట్రంక్ పెట్టెలో ఉంచి, దూరప్రదేశానికి దాన్ని రైల్లో బుక్ చేసాను. చాలా దూర ప్రదేశానికి. ఐరిస్ కనుక్కోలేనంత దూరం అది."

"ఎక్కడికిరా వెధవా? శాన్‌ఫ్రాన్సిస్కోకా?" డేవిడ్ భయంగా అడిగాడు.

అవునన్నట్లుగా లూకాస్ తల ఊపాడు.

శాన్‌ఫ్రాన్సిస్కో రైల్వే టెర్మినల్ అన్‌క్లెయిండ్ బేగేజ్ గదిలోని వాసన వేసే ట్రంక్ పెట్టె వంక మఫ్టీలోని ఇద్దరు పోలీసులు చూసారు. ఇద్దరిలోని ఒకరు దాని తాళాన్ని పగలకొట్టి మూతని తెరిచారు. ట్రంక్ పెట్టె మీద జి డబ్ల్యు అనే పొడి అక్షరాలు ఉన్నాయి. గెరాల్డైన్ వీలర్ పొడి అక్షరాలవి.

"దీన్ని ఎక్కడ బుక్ చేసారు?" ఓ పోలీస్ అడిగాడు.

"మెడ్వేల్ అనే చిన్న గ్రామంలో జార్జ్ లూకాస్ అనే అతను దీన్ని బుక్ చేసాడు" క్లర్క్ చెప్పాడు.

**(వచ్చేనెల మరో కథ)**

Post your comments